క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

జనగామ: జనగామ ఆర్టీసీ డిపోలో నేడు(మంగళవారం) డయల్ యువర్ డీఎం ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని డిపో మేనేజర్ స్వాతి సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సలహాలు, సూచనల కోసం 99592 26050 నంబర్‌కు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ ప్రోగ్రాంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

డీఏలు విడుదల చేయాలి

జనగామ: ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం బకాయి ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్లా తిరుపతిరెడ్డి, వంగ మల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా ఆర్థికపరంగా ఎలాంటి ప్రయోజనం లేదని, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల్ని పరిష్కరించడం లేదన్నారు. నవంబర్ 22లోపు డీఏలను విడుదల చేయాలని, లేనిపక్షంలో 23న హైదరాబాద్‌లో ధర్నా గ్రహదీక్ష చేపడతామని వారు తెలిపారు.

నిరసన



జనగామ రూరల్: మండలంలోని చౌడారం గ్రామంలోని రంగనాయక స్వామి ఆలయ భూమిని ఆక్రమించిన వారిపై, అలాగే కోనుగోలు చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.

కళలను భవిష్యత్ తరాలకు అందించాలి

బచ్చన్నపేట: పూర్వీకుల నుంచి నేర్చుకున్న కళలు కనుమరుగవకుండా భవిత్ తరాలకు అందించాలని చంద్రకళా నిలయం గురువు శ్రీ పేరిణి సంతోష్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని శ్రీనివాస గార్డెన్‌లో గజ్జ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శిష్య బృందంచే నృత్య నీరాజనం చేపట్టారు. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంక్షాపూర్ వాసి హైదరాబాద్‌లో మృతి

తరిగొప్పుల: మండలంలోని అంక్షాపూర్ గ్రామానికి చెందిన శివరాత్రి యాదయ్య (41) హైదరాబాద్‌లో విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. యాదయ్య బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి పనులు చేసుకుంటున్నాడు. అక్కడ ఓ భవనంలో లిఫ్ట్ క్రేన్‌లో పని చేస్తున్న సమయంలో కరెంట్ షాక్‌తో బిల్డింగ్‌పై నుంచి పడి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య రజిత, పిల్లలు ఉన్నారు.

లారీ డ్రైవర్‌ను ఢీకొట్టిన కారు

దేవరుప్పుల : జనగామ–సూర్యాపేట రహదారిలో ధరావత్‌తండా పరిధిలో సోమవారం రాత్రి ఓ లారీడ్రైవర్‌ను కారు ఢీకొట్టగా తీవ్ర గాయపడ్డాడు. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాలు.. మానుకోట జిల్లా గూడూరు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన గుండె గాని నరేశ్ తన లారీతో ఖమ్మం నుంచి జనగామ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో దేవరుప్పుల మండలం మరిపడిగె స్టేజీ సమీపంలో సహచరుల లారీ రిపేరుకు వచ్చింది. అయితే రోడ్డు పక్కన లారీ ఆపి చూసేందుకు వెళ్తున్న క్రమంలో తిర్మలగిరి నుంచి జనగామ వైపు వస్తున్న కారు లారీ డ్రైవర్ నరేశ్‌ను ఢీకొట్టగా తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అంబులెన్స్ లేకపోవడంతో క్షతగాత్రుడిని వైద్యం కోసం పోలీసు వాహనంలోనే జనగామ ఆస్పత్రికి తరలించారు. కారును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ధాన్యం చోరీ

జఫర్‌గఢ్: రోడ్డుపై అరబోసిన ధాన్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ఎత్తుకెళ్లిన సంఘటన మండలంలోని సూరారం గ్రామ శివారు చర్లతండాలో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రామ్‌చరణ్ తెలిపిన ప్రకారం వివరాలు.. తండాకు చెందిన లకవత్ యాకుబ్ నాయక్ వరి పంటను యంత్రం ద్వారా కోసి ధాన్యాన్ని గ్రామ శివారులోని రోడ్డుపై ఆరబోశాడు. అర్ధరాత్రి సమయంలో వరి ఆరబోసిన ధాన్యంలో 3 క్వింటాన్లు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దూడలపై కుక్కల దాడి

లింగాలఘణపురం: మండల కేంద్రంలో గత రెండు రోజులుగా కుక్కలు వ్యవసాయ బావుల వద్ద ఉన్న దూడలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. సోమవారం బోయిని సత్యనారాయణకు చెందిన ఏడాది దుడ్డపై దాడి చేసి ఇష్టారాజ్యంగా గాయపరిచాయి. రెండు రోజుల క్రితం దాయ వీరస్వామికి చెందిన రెండు దూడలపై దాడి చేయగా అందులో ఒకటి చనిపోయింది. చికెన్ సెంటర్‌లోని వ్యర్థాలను గ్రామంలోని పొలిమేరల్లో వేయడంతో మాంసానికి అలవాటుపడిన కుక్కలు దూడలపై దాడి చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సా..గుతున్న కాల్వ పనులు

- 15 ఏళ్లుగా పూర్తికాని భూసేకరణ
- బాటిల్ నెక్ పనుల్లో మరింత జాప్యం



భూమి సేకరణ పూర్తికాక నిలిచిన కాల్వ పనులు



ముళ్ల పొదలతో నిండిన కాల్వ

లింగాలఘణపురం: చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకంలో రఘునాథపల్లి మండలంలో 2009లో చేపట్టిన అశ్వరావుపల్లి రిజర్వాయర్ ప్రధాన కాల్వ పనులు 15 ఏళ్లుగా కొనసాగుతున్నాయి. 95 శాతం పనులు పూర్తయినప్పటికీ అక్కడక్కడా మరో 5 శాతం బాటిల్ నెక్ పనుల్లో భూసేకరణ జరుగకపోవడంతో రైతులకు సాగునీరు అందడంలేదు. అశ్వరావుపల్లి రిజర్వాయర్‌తో జిల్లాలోని రఘునాథపల్లి, జనగామ, లింగాలఘణపురం మండలాలతో పాటు యాదాద్రి జిల్లాలోని ఆలేరు నియోజకవర్గంలోని మండలాల్లో 43వేల ఎకరాలకు ప్రత్యక్షంగా సాగునీరు అందుతుంది. చెరువులు నింపితే భూగర్భ జలాలు పెరిగి మరింత సాగు పెరుగనుంది. ఈ ఏడాది సరైన వర్షాలు కురియక చెరువులు, కుంటలు నిండలేదు. వానా కాలంస సాగు విస్తీర్ణం గత ఏడాది 15,808 ఎకరాలుంటే ఈ ఏడాది 15,089 ఎకరాల్లో అంటే సుమారు 700 ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గింది.

ఆగిపోయిన 68 ఎకరాల భూసేకరణ..

అశ్వరావుపల్లి రిజర్వాయర్ పరిధిలో జనగామ, యాదాద్రి రెండు జిల్లాల్లో 43,000 ఎకరాలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంగా 2009లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి రిజర్వాయర్ నిర్మాణం చేశారు. అందుకు జనగామ జిల్లాలో 1,414 ఎకరాలు, యాదాద్రి జిల్లాలో 488 ఎకరాలు మొత్తం 1,903 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంది. అందులో జనగామలో 1370, యాదాద్రిలో 462 ఎకరాలు భూసేకరణ చేశారు. ఇక కేవలం జనగామలో 44, యాదాద్రిలో 26 ఎకరాలు భూసేకరణ జరగాలి. దీనికి ప్రభుత్వం 2022లోనే రూ.40 కోట్లు విడుదల చేసింది. లింగాలఘణపురం మండలంలో నెల్లుట్ల, కళ్లెం, జీడికల్ గ్రామాల్లో 5.36 ఎకరాల భూసేకరణ చేసి కాల్వ పనులను పూర్తి చేయాల్సి ఉంది. నెల్లుట్ల సమీపంలో 16ఎల్ తూము వద్ద కేవలం ఆరు గుంటల భూసేకరణ చేపట్టక కాలువ పనులు చేపట్టలేదు. దీంతో లింగాలఘణపురం పాత చెరువులోనికి నీరు వచ్చే అవకాశమే లేదు.

ఎమ్మెల్యే శ్రీహరి హామీ నెరవేరేనా..?

ఎన్నికల ముందు ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండలంలోని అన్ని చెరువులను యాసంగిలో గోదావరి జలాలతో నింపి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే అధికారుల వెంటబడుతూ మిగిలిపోయిన భూసేకరణ పనులు పూర్తి చేయాలని సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇటీవల నీటిపారుదల శాఖ ఈఎన్‌సీని కూడా కలిసి సమీక్షించి యాసంగిలో చెరువులు నింపాలని కోరారు.

భూసేకరణలో అధికారుల నిర్లక్ష్యం

గత 15 ఏళ్లుగా అశ్వరావుపల్లి రిజర్వాయర్ కాల్వ పనుల్లో మిగిలిన 68 ఎకరాల భూసేకరణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ అథారిటీ పేరుతో బ్యాంకులో డిపాజిట్ చేయాల్సిన డబ్బులను డిపాజిట్ చేసి ఏళ్ల తరబడి వస్తున్న వడ్డీకి ఆశ పడుతున్నట్లు తెలిస్తోంది. అధికారుల నిర్లక్ష్యంతోనే రైతులకు సాగునీరు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎప్పుడో తీసిన కాల్వలు చెట్లు, పొదలతో నిండిపోయి ఉన్నాయి. తీసిన కాల్వలపై కూడా అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది.

చెరువులు నింపాలి



యాసంగిలో చెరువు నిండితేనే పంటల సాగుపై ఆశలు. వానాకాలంలో సరైన వర్షాలు కురియక సాగు తగ్గింది. ఇప్పుడు చెరువులో నీరు లేకపోతే ఇక సాగు చేయడం కష్టమే. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని చెరువు నింపాలి.

– గట్టగల్ల అనిల్‌కుమార్, రైతు, లింగాలఘణపురం

భూసేకరణపై దృష్టి పెట్టాం

ఇటీవలే వచ్చా.. కొద్దిపాటి భూసేకరణే మిగిలింది. దానిపైనే దృష్టి పెట్టాం. నెల్లుట్ల సమీపంలోని 6 గుంటల భూసేకరణకు చర్యలు తీసుకుంటున్నాం. ఎవరికి ఇబ్బంది లేకుండా పరిహారం అందించి పనులు జరిగే విధంగా చూస్తా.

– కొమురయ్య, ఆర్డీఓ

చర్యలు తీసుకుంటున్నాం..

రెవెన్యూ అధికారుల వెంట పడుతున్నాం.. అనేక సార్లు వారి దృష్టికి తెచ్చాం..6 గుంటల భూమికి పరిహారం ఇవ్వకపోవడంతో అక్కడ పనులు సాగనీయడంలేదు. కొద్ది శాతం మాత్రమే ఉంది. అవి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– రవీందర్, డీఈ, నీటిపారుదల శాఖ

ఓయూ వీసీని కలిసిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



జనగామ: ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ మొలుగురం కుమార్‌ను కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఓయూ వీసీకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, రాష్ట్ర యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, మాల మహాసభ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి కుమార్, తెలంగాణ జనసమితి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్‌కుమార్ ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నర్మెట: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీపీయూఎస్ మండల అధ్యక్షుడు చిక్కుడు మహేందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రామానుజాచారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యపు ధోరణి కనబడుతుందని దానిని విడనాడి పరిష్కరించాలని అన్నారు. ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి దామోదర్, సభ్యులు సరళ, అంబదాస్, బత్తుల నరేందర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



మధును సన్మానిస్తున్న నాయకులు



మొహీనొద్దీన్‌కు బొకే ఇస్తున్న కమిటీ సభ్యులు

బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ గుడి నిర్మాణానికి ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు నీలం మధు రూ.లక్ష విరాళం అందించినట్లు బీఆర్‌ఎస్ నాయకులు ఇమ్మడి జితేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మతల్లి నూతన గుడిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మధును శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులకు నీల మధు, బాపిరాజు, జక్కుల ఎల్లయ్య, బుర్రి నర్సింహులు, గోనెల మహేందర్, బెజ్జరబోయిన అనిల్ పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయ నిర్మాణానికి చేయూత

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గామాత ఆలయ నిర్మాణానికి కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహీనొద్దీన్ రూ.50 వేల విరాళం అందజేశారు. సోమవారం కార్వాన్‌లోని ఆయన నివాసంలో కలువగా విరాళం అందజేసినట్లు గ్రామానికి చెందిన గుడి నిర్మాణ కమిటీ బాధ్యులు తెలిపారు. కొమ్మరాజుల శ్రీనివాస్, రమేశ్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ యశ్వంత రెడ్డి, అశోక్, రవి, కింగర్ల అరుణ్ ఉన్నారు.

ఆంధ్రతండాకు బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు వద్ద పూజ చేస్తున్న గ్రామస్తులు

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ మీదుగా మంగలిబండతండా, పొట్టిగుబ్బటితండా నుంచి ఆంధ్రతండాకు సోమవారం ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసు ప్రారంభించారు. గతంలో మాదిరిగా గ్రామాల మీదుగా బస్సు సర్వీస్ నడపాలని ఇటీవల ఆయా గ్రామాల ప్రజల విజ్ఞప్తి మేరకు డిపో మేనేజర్ స్వాతి స్పందించి బస్సు సర్వీసు పునరుద్ధరించారు. ఈ సందర్భంగా మంగలిబండతండాలో గ్రామానికి వచ్చిన బస్సు వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్, సురేందర్‌గౌడ్, మీన్యానాయక్, ప్రవీణ్‌కుమార్, కనకయ్య, బాల్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సురేందర్, మల్లారెడ్డి, రాజు, నరేందర్, భాస్కర్, నరసింహ పాల్గొన్నారు.

నేడు ఓటరు జాబితా విడుదల

పాలకుర్తి టౌన్: పాలకుర్తి అసెంబ్లీ నియోజవర్గంలో 2025 సవరణకు సంబంధించిన ప్రాథమిక ఓటరు జాబితా(డ్రాఫ్ట్)ను నేడు(మంగళవారం) విడుదల చేయనున్నట్లు ఆదనపు కలెక్టర్ (రెవిన్యూ), ఓటరు నమోదు అధికారి బి రోహిత్ సింగ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పోలింగ్ కేంద్రాల సంఖ్య 296కు చేరిందని తెలిపారు. . 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు ఫారం 6 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా పాలకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రత్యేక సమగ్ర సవరణ 2025 ప్రాథమిక ఓటర్ల జాబితాను నియోజకవర్గంలోని నిర్దేశిత పోలింగ్ కేంద్రాల్లో, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నేడు(మంగళవారం) అందుబాటులో ఉంచనున్నట్లు ఆర్డీఓ డీఎస్ వెంకన్న సోమవారం ప్రకటనలో తెలిపారు. గతంలో స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 290 పోలింగ్‌స్టేషన్లు ఉండగా నూతనంగా ఒక పో లింగ్‌స్టేషన్ చేర్చడంతో ప్రస్తుతం 291 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. 2024 అక్టోబర్ 29 నాటికి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,56,061 కాగా, పురుషులు 1,25,987, స్త్రీలు 1,29,898, ఇతరులు ము గ్గురు, సర్వీసు ఓటర్లు 173 మంది ఉన్నట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



జనగామ రూరల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివరాజ్



స్టేషన్‌ఘన్‌పూర్: పాంనూర్‌లో..

జిల్లాలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగులోలు కేంద్రాలను మార్కెట్ చైర్మన్, చైర్‌పర్సన్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్, తహసీల్దార్, కాంగ్రెస్ నాయకుడు తదితరులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని, గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని అన్నారు. ఆయా కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, వైస్‌చైర్మన్ కొల్లూరి శివకుమార్, డైరెక్టర్ గాదె రమేశ్, ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నల్లనాగుల శ్వేతవెంకటాచారి, తహసీలార్లు పి.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ దేవరుప్పుల మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, ఆయా మండలాల అధికారులు, గ్రామైక్య సంఘాల బాధ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



బచ్చన్నపేట: సాల్వాపూర్‌లో..



రఘునాథపల్లి: ఖిలాషాపూర్‌లో..



లింగాలఘణపురం: జీడికల్‌లో..

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొంగులేటికి పుష్పగుచ్ఛం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కనుకయ్య ఉన్నారు.

నియామకం

కొడకండ్ల: మున్నూరు కాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పల్లె శ్రీనివాస్ నియామకమయ్యాడు. ఏడునూతుల గ్రామానికి చెందిన ఆయనకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ నియామక ఉత్తర్వులు ఇవ్వగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోగుల సారంగపాణి, వీరమల్ల రాజు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు.

హమాలీ పేరుతో వ్యాపారి మోసం

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామంలో ధాన్యం కొనుగోలు చేసే వ్యాపారి హమాలీ పేరుతో రైతులను మోసం చేస్తున్నాడని సోమవారం రాత్రి గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో వైరల్‌గా మారింది. గ్రామానికి చెందిన వంగపండ్ల గట్టు అనే ధాన్యం వ్యాపారి రైతుల వద్ద క్వింటా ధాన్యం కొనుగోలు చేసి రూ. 40 హమాలీకి అదనంగా తీసుకుంటున్నాడు. అందులో రూ. 10 తగ్గించి రూ.30 హమాలీకి ఇస్తుండడంతో విషయం తెలుసుకున్న రైతులు హమాలీల పక్షాన వ్యాపారిని నిలదీయగా స్పందించక పోవడంతో కర్ర మల్లారెడ్డి, కోతి శ్రీనివాస్ వైరల్ చేశారు. దీనిపై విచారణ చేపట్టాలని కోరారు.

మూతపడిన అంగన్‌వాడీని తెరిపించండి

లింగాలఘణపురం: మండల కేంద్రంలో దారిలేక రెండేళ్లుగా మూతపడిన అంగన్‌వాడీ–4 కేంద్రాన్ని తెరిపించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషాకు ఫిర్యాదు చేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

దేవరుప్పుల: మండలంలోని ముస్‌పహాడ్‌లో అధికారికంగా తలపెట్టిన ఐకేపీ కోనుగోలు కేంద్ర ప్రారంభోత్సవ సభలో నిబంధనల విస్మరణపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్‌కు బీఆర్‌ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చింత రవి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యవేక్షణలో ప్రారంభోత్సవాలు చేయాల్సిన ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాలుగా చేయడం తగదన్నారు.

సంక్షిప్తంగా

నివాళి

దేవరుప్పుల: మండలంలోని రామరాజుపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఉప్పునూతుల ఆనంద్ మృతదేహానికి బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆనంద్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జనగామ: జిల్లా జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజుతండ్రి మంగళంపల్లి జనార్దన్, ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురైన ఎస్ఆర్ బ్రదర్స్ క్లాత్ షాపు యజమాని శ్రీనివాస్ తండ్రి లక్ష్మీనారాయణ సోమవారం మృతి చెందాడు. కాగా, డీసీసీ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. మృతదేహాలపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, కౌన్సిలర్లు గాదెపాక రామచంద్రం, జక్కుల అనిత వేణుమాధవ్, బొట్ల శ్రీను, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ దాసరి క్రాంతి తదితరులు ఉన్నారు.

పెద్దబాయితండాలో..

కొడకండ్ల: మండలంలోని పెద్దబాయితండాకు చెందిన మాజీ ఎంపీటీసీ రాంకోటి తల్లి వాంకుడోత్ నెజమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. కాగా, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ గ్రామానికి చేరుకొని నెజమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి

దేవరుప్పుల: మండలంలోని నల్లకుంట తండాకు చెందిన కాంగ్రెస్ గ్రామ ఉపాధ్యక్షుడు బానోత్ మోహన్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతి పట్ల పలువురు మండల, గ్రామ నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన గాదెపాక పద్మ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, సోమవారం మృతురాలికి కుమారులు లేకపోవడంతో కూతురు వెంకటమ్మ తల్లికి తలకొరివి పెట్టింది. గాదెపాక భాస్కర్, రిజిస్టర్ సోమయ్య ఉన్నారు.

ఝాన్సీరెడ్డిని పరామర్శించిన జర్నలిస్టులు

పాలకుర్తి టౌన్: వేదిక కూలి కాలు విరిగి హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నియజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని సోమవారం పాలకుర్తి ప్రెస్‌క్లబ్ సభ్యులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేవోజి, కార్యదర్శి పాషా తదితరులు ఉన్నారు.

రోడ్డు పక్క బావుల యజమానులకు నోటీసులు

చిల్పూరు: పల్లగుట్ట నుంచి చిల్పూరుకు వెళ్లే రోడ్డు పక్కన ప్రమాద కరంగా ఉన్న వ్యవసాయ బావుల యజమానులకు తహసీల్దార్ సరస్వతి ఆదేశాల మేరకు ఆర్ఐ కల్వల శ్రీని వాస్ సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కుంచాల వరంగల్ మల్లయ్య, రాపోలు వెంకటమల్లులకు చెందిన వ్యవసాయ బావులు రోడ్డు పక్కనే ఎదురెదురుగా ప్రమాదకరంగా ఉన్నాయని, వాటికి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని తెలిపినా పట్టించుకోక పోవడంతో నోటీసులు జారీ చేశామన్నారు.

రహదారులకు మరమ్మతులు చేయాలి

జఫర్‌గఢ్: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోడ్లు దెబ్బతిని గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

శ్రమదానం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ జి.వేణు ఆధ్వర్యంలో సోమవారం శ్రమదానం కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు, చెత్త, వ్యర్థపదార్థాలను తొలగించి శుభ్రం చేశారు.

జనార్దన్ మృతి పార్టీకి తీరని లోటు



నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రావు

జనగామ రూరల్: మంగళంపల్లి జనార్దన్ మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన జనార్దన్ మృతదేహానికి సోమవారం ఆయన పూల మాలవేసి నివాలర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. నీతి నిజాయితీకి మారుపేరుగా పీడిత ప్రజల పక్షాన పోరాటం చేసిన గొప్ప ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడు మంగళంపల్లి జనార్దన్ అని అన్నారు. చిన్నతనం నుంచే కమ్యూనిస్టు పార్టీలో చేరి నమ్మిన సిద్ధాంతం కోసం పని చేసి తుది శ్వాస వరకు పేద ప్రజలకు సేవ చేశారని అన్నారు. జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి సోమయ్య, రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు, మోతె లింగారెడ్డి,లక్ష్మి నర్సయ్య, రామ్ దయాకర్, సుగుణమ్మ, కావటి యాదగిరి, వైకుంఠం, చింతకింది అరుణ తదితరులు ఉన్నారు.

చిల్పూరు: చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర నేత మంగళపల్లి జనార్దన్ మృతి పద్మశాలి సంఘానికి తీరని లోటని, ఆయన ఆశయ సాధన కోసం పాటు పడాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్, మండల సంఘం అధ్యక్షుడు గజ్జెల దామోదర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ డాక్టర్ పేరాల సుధాకర్, బండారి రాజ్‌కుమార్, వేముల వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, రవి తదితరులు ఉన్నారు.

పరామర్శ


జనగామ: జిల్లా జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు తండ్రి జనార్దన్ మృతి చెందగా, సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పుష్పగుచ్ఛం వేసి నివాళులర్పించారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోండి



బచ్చన్నపేట: మండల కేంద్రంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని బ్యాంకు మేనేజర్ శివశంకర్ అన్నారు. సోమవారం మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామస్తులకు జనసురక్ష కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులోని ఖాతాదారులు జీవిత బీమా చేసి ధీమాగా ఉండాలన్నారు. పీఎంజేబీవై, పీఎస్‌బీవై సుకన్య పలు రకాల బీమాలను చేసుకోవచ్చునని తెలిపారు. బ్యాంకుల ద్వారా అందించే రుణాలను పొంది సకాలంలో చెల్లించాలని అన్నారు. బీసీ మల్లం శోభ , ఏబీఎం యుగేందర్, క్యాషియర్ భరత్ పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి



జనగామ రూరల్: జిల్లా కేంద్రంలో ఫైర్ సేఫ్టీ అనుమతులు లేని షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి బూడిద గోపి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో విజయ శ్రీలక్ష్మి ఎస్ఆర్ బ్రదర్స్ షాపింగ్ మాల్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమై భారీ ఆస్తి నష్టం వాటిల్లిందని, దీనికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. జిల్లా కేంద్రంలో షాపింగ్ మాల్స్ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని వాటికి పర్మిషన్లు ఉన్నాయా లేదా అధికారులు తనిఖీ చేయాలని అన్నారు. అజారుద్దీన్, కళ్యాణం లింగం, పందిళ్ల కళ్యాణి, లలిత, శ్రావణ్, శ్రీకాంత్, కనుకాచారి, యాకయ్య పాల్గొన్నారు.